సాక్షి నిర్మల్

ఆదివారం । 10 । నవంబర్ । 2024



పంటలపై అడవిపందుల దాడి

ఆరుగాలం శ్రమించి సాగు చేస్తున్న పంటలను అడవిపందులు ధ్వంసం చేస్తున్నాయి. మూకుమ్మడిగా దాడిచేస్తుండడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. 9లో▸



'శత'క్కొట్టాడు..

ఆదిలాబాద్ గల్లీలో బ్యాట్ పట్టాడు.. హైదరాబాద్ తరఫున సత్తా చాటుతున్నాడు. ఎస్జీఎఫ్ నుంచి హెచ్‌సీఏ దాకా అంచెలంచెలుగా ఎదిగి.. టీమిండియా రేసులోకి దూసుకొస్తున్నాడు. 10లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
32.2 / 18.6

చాలావరకు ఎండగా ఉంటుంది. అప్పుడప్పుడు ఆకాశం మేఘావృతం అవుతుంది. సాయంత్రం నుంచే చలి మొదలవుతుంది. తెల్లవారుజామున మంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

పెండింగ్ బిల్లులు చెల్లించాలని మంత్రికి వినతి



మంత్రికి వినతిపత్రం ఇస్తున్న రాజేందర్

ముధోల్: సర్పంచుల పెండింగ్ బిల్లులను డిసెంబర్‌లోపు విడుదల చేయాలని తెలంగాణ రాష్ట్ర మాజీ సర్పంచుల తరఫున జేఏసీ సహాయ కార్యదర్శి వెంకటాపూర్ రాజేందర్ బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌కు శనివారం వినతిపత్రం ఇచ్చారు. హైదరాబాద్‌లోని మినిష్టర్ క్యాంపు కార్యాలయంలో మంత్రిని కలిశారు. మాజీ సర్పంచులు ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందులను మంత్రికి వివరించారు. పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని కోరారు. దీనికి మంత్రి సానుకూలంగా స్పందించారు. సర్పంచుల సంఘం ప్రతినిధులను చర్చలకు పిలిచి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారని రాజేందర్ తెలిపారు.

రేపు టీయూటీఎఫ్ రాష్ట్ర మహాసభ



మాట్లాడుతున్న రఘునందన్‌రెడ్డి

నిర్మల్ రూరల్: ఆదిలాబాద్ పట్టణంలోని టీటీడీ కల్యాణమండపంలో సోమవారం తెలంగాణ ఐక్యఉపాధ్యాయ ఫెడరేషన్(టీయూటీఎఫ్) రాష్ట్ర మహాసభ నిర్వహించనున్నట్లు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.రఘునందన్‌రెడ్డి, రాష్ట్ర కోశాధికారి పి.మొగులయ్య తెలిపారు. జిల్లా కేంద్రంలోని సంఘ భవనంలో శనివారం మాట్లాడారు. సంఘం ఉపాధ్యాయుల సమస్యలపై అలుపెరగని పోరాటం చేస్తుందన్నారు. పరిష్కారానికి ప్రభుత్వాని, ఉపాధ్యాయులకు వారధిగా పనిచేస్తుందన్నారు. మహాసభల్లో విద్యారంగ అభివృద్ధికి చేపట్టాల్సిన కార్యక్రమాలపై తీర్మానాలు చేస్తామని చెప్పారు. ఉపాధ్యాయులు, మేధావులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. జిల్లా అధ్యక్షుడు తోడిశెట్టి రవికాంత్, పోల ధర్మరాజ్, లక్ష్మీప్రసాద్ రెడ్డి, నర్సారెడ్డి పాల్గొన్నారు.

'బెదిరింపులు ఆపాలి'

నిర్మల్‌ఖైస్‌గేట్: అంగన్‌వాడీ టీచర్స్‌పై అధికారుల బెదిరింపులు ఆపాలని అంగన్‌వాడీ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.లలిత కోరారు. సమగ్ర కుటుంబ సర్వేలో పాల్గొనబోమని అంగన్‌వాడీ యూనియన్ ఆధ్వర్యంలో స్థానిక మున్సిపల్ కమిషనర్‌కు శనివారం వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గతంలోనే సమగ్ర కుటుంబ సర్వే చేయమని గత కమిషనర్‌తోపాటు సీడీపీవోకు వినతిపత్రాలు ఇచ్చామన్నారు. అయినా ఎంపీడీవోలు పంచాయతీ అధికారులు సర్వేలో పాల్గొనాలని ఒత్తిడి చేస్తున్నారన్నారు. ఇకనైనా అంగన్‌వాడీలపై అధికారుల వేధింపులు ఆపకపోతే పోరాటం ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షురాలు శైలజ, సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు పోశెట్టి, భాగ్య, హేమలత పాల్గొన్నారు.

14న భైంసాకు ఏఐసీసీ కార్యదర్శి

భైంసాటౌన్: ఏఐసీసీ తెలంగాణ కార్యదర్శి పి.విశ్వనాథన్ ఈనెల 14న భైంసాకు రానున్నట్లు కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే బి.నారాయణ్‌రావు పటేల్ తెలిపారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పర్యటనలో భాగంగా స్థానిక ఎస్ఆర్ఆర్ గార్డెన్‌లో మధ్యాహ్నం 3 గంటలకు జరిగే కార్యక్రమంలో పాల్గొంటారని పేర్కొన్నారు. అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా కులాల సర్వే, స్థానిక సంస్థల ఎన్నికల సమాయత్తం, తదితర అంశాలపై సమీక్షిస్తారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఆశ్రమ పాఠశాల తనిఖీ



విద్యార్థులను ప్రశ్నలు అడుగుతున్న డీటీడీవో

కడెం: మండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలను డీటీడీవో అంబాజీ శనివారం తనిఖీ చేశారు. వంటగది పరిసరాలు, భోజనాలను పరిశీలించారు. తరగతి గదులకు వెళ్లి విద్యార్థులను ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. మెనూ ప్రకారం భోజనం అందించాలని సిబ్బందికి సూచించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు త్వరలో కొత్త మెనూ ప్రవేశపెట్టనున్నట్లు తెలిపారు.

మన బొమ్మకు.. మనమే అండ!



బొమ్మల తయారీ గురించి తెలుసుకుంటున్న విద్యార్థులు



- కొయ్యబొమ్మను కాపాడుకుందాం
- కళాకారులను ప్రోత్సహిద్దాం
- ఏపుగా పెరుగుతున్న పొనికి వనం
- కావాలి కొయ్యబొమ్మకు ఊతం

నిర్మల్: 'మాది నిర్మల్.. ' అని ఎక్కడ పరిచయం చేసుకున్నా.. 'ఓహో.. మీ దగ్గరే కదా కొయ్యబొమ్మలు తయారు చేస్తారు. చాలా బాగుంటాయి..' అని చెబుతుంటే నిర్మల్‌వాసిగా, కొయ్యబొమ్మలకు వారసుడిగా గర్వంగా ఫీలవుతాం. నిమ్మల ఒడిలో పురుడుపోసుకుంటున్న కొయ్యబొమ్మ విదేశాల వరకు మన కళానైపుణ్యాన్ని తీసుకెళ్తోంది. 'వాహ్.. నిర్మల్ బొమ్మ సూపర్..'అని మన ఊరికీ పేరు తెస్తూనే ఉంది. కొయ్యబొమ్మ కేవలం ఓ కళాకృతి మాత్రమే కాదు. మన నిర్మల్‌కు బ్రాండ్ అంబాసిడర్. ఏళ్లుగా అరలో ఒదిగిన ఆ కొయ్యబొమ్మ ఇప్పుడు దీనంగా చూస్తోంది. ఆదరించే వారు కరువవుతున్నారు. దీంతో చేసేవారూ తగ్గిపోతున్నారు. బొమ్మలకు ప్రాణంపోసే నకాశీ కుటుంబాలు ఉపాధి కోసం ఇతర మార్గాలు వెతుక్కుంటున్నాయి. ఇలాంటి తరుణంలో మన బొమ్మకు మనమే అండగా నిలువాల్సిన అవసరం ఉంది. ఇప్పటికే చాలామంది ఈ దిశగా.. తమవంతు ప్రయత్నం మొదలుపెట్టారు.

మన ఊరు.. మన బొమ్మ..

నిమ్మలంటే.. నిన్నమొన్నటిది కాదన్న విషయం అందరికీ తెలిసిందే. ఊరు ఏర్పడినప్పటి నుంచే ఇక్కడ కళలకు ప్రోత్సాహం ప్రారంభమైంది. నిమ్మనాయుడి కాలంలో నకాశీల చేతుల్లో పొనికి కొమ్మ బొమ్మగా రూపుదిద్దుకుంది. వందల ఏళ్ల కిందటి ప్రాచీనకళగా ఈ బొమ్మల తయారీ కొనసాగుతోంది. తరాలు గడిచినా నకాశీలు తమ వారసత్వాన్ని ఇంకా కాపాడుకుంటూ వస్తున్నారు. సరైన ప్రోత్సాహం లేక, ప్రజాదరణ కూడా తగ్గుతుండటంతో ఇప్పటికే చాలా కుటుంబాలు కొయ్యబొమ్మకు దూరమై.. ఇతర వృత్తులు, ఉపాధులు, ఉద్యోగాల్లో స్థిరపడ్డాయి. కానీ.. ఇప్పటికీ వారందరికీ తమకు గుర్తింపునిచ్చే కొయ్యబొమ్మ అంటే ప్రాణమే.

గట్టి ప్రయత్నమే..

అరుదైన ఈ హస్తకళను కాపాడుకోవడం అవసరమని గుర్తించిన వాళ్లూ ఉన్నారు. గత కలెక్టర్ వరుణ్‌రెడ్డి, డీఆర్‌డీవో విజయలక్ష్మి కొయ్యబొమ్మలకు కావాల్సిన పొనికిచెట్ల ఉనికిని కాపాడేందుకు విశేష కృషిచేశారు. మామడ మండలం లింగాపూర్, జగదాంబతండాల వద్ద, సారంగపూర్ మండలం మహబూబ్‌ఘాట్ ప్రారంభం వద్ద పొనికి వనాలను ఏర్పాటు చేయించారు. ప్రస్తుతం లింగాపూర్, జగదాంబతండాల్లో వందల్లో పొనికిచెట్లు ఏపుగా పెరిగాయి. మహబూబ్‌ఘాట్ వద్ద కోతుల కారణంగా చెట్లు దెబ్బతింటున్నాయి.



లింగాపూర్‌లో ఏపుగా పెరిగిన పొనికిచెట్లు



కొయ్యబొమ్మలను పరిశీలిస్తున్న చిన్నారులు

అందరూ కలిస్తేనే..

నిర్మల్ బొమ్మ కలకాలం నిలిచి ఉండాలంటే జిల్లావాసుల చేతుల్లోనే ఉందన్న విషయాన్ని గుర్తించాలి. ఇందుకోసం అందరూ కలిసి కొయ్యబొమ్మకు అండగా నిలువాలి. ప్రభుత్వ పరంగా పొనికివనాలను పెంచుతున్నా.. మరింతగా సహకారం అందించాల్సిన అవసరం ఉంది. బంధుమిత్రుల ఇళ్లలో మన జ్ఞాపకార్థం ఏదైనా ఉండాలంటే.. అది మన నిర్మల్ కొయ్యబొమ్మనే కావాలి.

- పెళ్లిళ్లు, బర్త్‌డేలు, గృహప్రవేశాలు, పూర్వ విద్యార్థుల సమ్మేళనాలు.. ఇలా ఏ శుభకార్యమైనా కొయ్యబొమ్మలను కానుకలుగా ఇవ్వొచ్చు.
- చిన్నారులు ఆడుకోవడానికి హానికరమైన ప్లాస్టిక్ బొమ్మలు కాకుండా కర్రతో చేసిన వాటిని కొనిస్తే బాగుంటుంది.
- దూరప్రాంతాలు, దేశవిదేశాల్లో ఉంటున్న వారికి నిర్మల్ బొమ్మలు, పెయింటింగ్స్ అంటే చాలా ఆసక్తి ఉంటుంది. అలాంటి వారి దగ్గరికి వెళ్లినప్పుడు వీటిని తీసుకెళ్లాలి.
- ఇంట్లో అలంకరణ వస్తువులుగానూ కొయ్యబొమ్మలు, పెయింటింగ్స్ బాగుంటాయి.
- బొమ్మల కొలువుగా నిర్మల్ బొమ్మలను అలంకరించుకోవచ్చు.
- కేవలం అరలో పెట్టుకునేందుకే కాకుండా.. పెన్‌స్టాండ్‌లుగా, మెమోంటోలుగానూ కొయ్యబొమ్మలను తయారు చేసిస్తారు.
- దూరప్రాంతాల నుంచి బంధుమిత్రులు ఎవరొచ్చినా.. నిర్మల్ బొమ్మల తయారీని, ప్రదర్శన కేంద్రాన్ని చూపిస్తే.. వారు కూడా వాటి కొనుగోలుకు ఇష్టపడతారు.
- ప్రధానంగా విద్యాసంస్థలు తమ విద్యార్థులకు కొయ్యబొమ్మల తయారీ, ప్రదర్శనను పరిచయం చేయాలి. ముందుతరాలకు మనదైన బొమ్మల గొప్పతనాన్ని అందించాల్సిన అవసరం ఉంది.

కొయ్యబొమ్మలతోనే...



నిర్మల్‌కు ఎంతో చరిత్ర ఉంది. ఇక్కడి కొయ్యబొమ్మలకు కూడా చాలా బాగుంటాయి. ఇక్కడి కళాకారులను, బొమ్మలను ప్రోత్సహించేందుకు సహకారం అందిస్తున్నాం. దాదాపు వంద వరకు పెన్‌స్టాండ్‌లను, మెమోంటోలను కొయ్యబొమ్మలతోనే చేయించాం. బొమ్మల పరిరక్షణకు అందరూ ముందుకు రావాలి. – జానకీషర్మిల, ఎస్పీ

'పొనికి' ఉనికి కాపాడేందుకు..



కొయ్యబొమ్మలను తయారు చేయాలంటే పొనికికర్ర అవసరమని గుర్తించాం. ఈమేరకు గత కలెక్టర్ వరుణ్‌రెడ్డి ప్రత్యేక దృష్టిపెట్టడంతో జిల్లాలో మూడుచోట్ల పొనికి వనాలను పెంచుతున్నాం. అసెంబ్లీ ఎన్నికల్లో స్వీప్‌లో భాగంగా జిల్లాకేంద్రంలోని ఈద్‌గాంలో ప్రత్యేకంగా కొయ్యబొమ్మల పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశాం. – విజయలక్ష్మి, డీఆర్‌డీవో

పిల్లలకు పరిచయం చేద్దాం..



మన నిర్మల్ అంటేనే ఎంతో ఘనమైన చరిత్ర ఉంది. ఇక్కడి కోటలు, బురుజులే కాదు.. అంతకు మించి కొయ్యబొమ్మల ఘనత గొప్పది. ఎక్కడికెళ్లినా నిర్మల్ అనగానే బొమ్మలను గుర్తుచేస్తుంటారు. అలాంటి వాటిని మన పిల్లలకు పరిచయం చేయాల్సిన అవసరం ఉంది. – శ్యామ్‌కుమార్, హెచ్ఎం, శ్రీవిద్యానికేతన్

ప్రత్యేక ఓటరు జాబితా సవరణ పకడ్బందీగా చేపట్టాలి

- కలెక్టర్ అభిలాష అభినవ్



వివరాలు అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్

నిర్మల్ రూరల్: ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. మండలంలోని కొండాపూర్ ప్రభుత్వ పాఠశాలలో నిర్వహిస్తున్న ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఓటరు జాబి తాలో ఏవైనా అభ్యంతరాలు ఉంటే ఆదివారం అన్ని పోలింగ్ బూత్‌లలో బూత్ స్థాయి అధికారులు అందుబాటులో ఉంటారన్నా రు. ఓటరుగా నమోదు, పేరు, చిరునామా తదితర వివరాల్లో తప్పులు ఉంటే అధికారులకు ఆధారాలతో తెలియజేయాలని సూచించారు. 2025, జనవరి 01 నాటికి 18 ఏళ్లు నిండే యువతీ యువకులు ఫారం నంబర్ 6తో ఓటరుగా నమోదు చేసుకోవచ్చన్నారు. కొత్తగా ఓటరు జాబితాలో అభ్యంతరాలకు ఫారం-7, జాబితాలో చిరునామా, సవరణలకు ఫారం-8 ద్వారా నమోదు చేసుకోవచ్చని వివరించారు. అంతకుముందు పాఠశాలను పరిశీలించి, విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా అన్నిరకాల సౌకర్యాలు కల్పించాలని అధికారులు, ఉపాధ్యాయులను ఆదేశించారు. విద్యార్థులకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలని, మరుగుదొడ్లకు అవసరమైన మరమ్మతులు చేపట్టాలని, పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. కార్యక్రమంలో డీఆర్‌వో రత్నకళ్యాణి, బూత్‌స్థాయి అధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్

ధాన్యం కొనే దిక్కులేదు

- వడ్లకు బోనస్ ఊసే లేదు
- కేంద్రాలు ప్రారంభించి రోజులు గడుస్తున్నా కొనుగోళ్లు చేయడం లేదు..
- రాష్ట్ర ప్రభుత్వంపై బీజేఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రేమేందర్ మండిపాటు



వడ్లను పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

సారంగపూర్: అధికారంలోకి రాకముందు కాంగ్రెస్ ప్రభుత్వం వరికి 500 బోనస్ ఇస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ.. ఇప్పుడు అధికారంలో ఉన్నా.. వడ్లను కొనడం లేదని బీజేఎల్పీ నేత, నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్ ఆరోపించారు. మండలంలోని ఆలూరు గ్రామంలో వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శనివారం పరిశీలించారు. అనంతరం సారంగాపూర్‌లో సీసీఐ పత్తికొనుగోలు కేంద్రాలను సందర్శించారు. రైతులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మహేశ్వర్‌రెడ్డి, ప్రేమేందర్ మాట్లాడుతూ హడావుడిగా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినా.. కొనుగోళ్లు ఎందుకు చేయడం లేదని ప్రశ్నించారు. రైతుల విలువైన సమయం మార్కెట్‌ల చుట్టూ తిరగడానికే సరిపోతుందని ఆగ్రహించారు. యాసంగి పనులు చేసుకోలేకపోతున్నారని తెలిపారు. కొనుగోళ్లలో జాప్యంపై కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడారు. కొర్రీలు పెట్టకుండా ధాన్యం కొనుగోలు చేసి రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. పత్తి కొనుగోళ్లలో జాప్యంపై సీసీఐ అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తామని తెలిపారు. అవసరమైతే మార్కెట్ యార్డు ఆవరణలో ఉన్న వేబ్రిడ్జిని ఉపయోగించి కొనుగోళ్లలో వేగం పెంచాలని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు అయ్యన్నగారి భూమయ్య, బీజేపీ జిల్లా అధ్యక్షుడు అంజుకుమార్‌రెడ్డి, నాయకులు సత్యనారాయణగౌడ్, రావుల రాంనాథ్, విలాస్, రాంశంకర్‌రెడ్డి, చంద్రప్రకాశ్‌గౌడ్, గంగారెడ్డి, పోతన్న, నారాయణ, తిరుమలచారి, చాణక్య, విజయ్ పాల్గొన్నారు.

పత్తి కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన బీజేఎల్పీ నేత

నిర్మల్‌ఖైస్‌గేట్: జిల్లా కేంద్రంలోని కేదార్‌నాథ్ జిన్నింగ్ మిల్లులో ఏర్పాటు చేసిన సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రమేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే రామారావుపటేల్ శనివారం పరిశీలించారు. రైతుల ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. పత్తిలో తేమ శాతం పరిశీలించారు. వారివెంట జిల్లా అధ్యక్షుడు అంజుకుమార్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు రావుల రాంనాథ్, భూమయ్య, మండల మాజీ అధ్యక్షుడు సత్యనారాయణగౌడ్, నాయకులు మెడిసెమ్మె రాజు, సామ రాజేశ్వర్‌రెడ్డి, హరినాయక్, సాధం అరవింద్, తదితరులు ఉన్నారు.

పకడ్బందీగా కుటుంబ సర్వే

- ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క



వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్‌ఖైస్‌గేట్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వే పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. సమగ్ర కుటుంబ సర్వేపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, ప్రత్యేక కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానీయాతో కలిసి శనివారం హైదరాబాద్ నుంచి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సమగ్ర కుటుంబసర్వేకు తీసుకుంటున్న చర్యలపై అధికారులు, కలెక్టర్లతో చర్చించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేను అధికారులు సమన్వయంతో నిర్వహించి విజయవంతం చేయాలన్నారు. సర్వేపై ప్రజలకు అనేక సందేహాలు వస్తుంటాయని నివృత్తి చేస్తూ ముందుకు సాగాలన్నారు. ఎలాంటి సందేహాలున్నా ఎన్యూమరేటర్లు కలెక్టర్ల దృష్టికి తేవాలని సూచించారు. సర్వే ప్రక్రియలో మంత్రులు, ఎమ్మెల్యేలు భాగస్వాములు అయ్యేలా ఆహ్వానించాలన్నారు. సమగ్ర కుటుంబ సమాచారం సేకరణతో అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందించి వారి ఆర్థికాభివృద్ధికి కృషి చేయడం జరుగుతుందన్నారు. సర్వే సమాచారం గ్రామస్థాయిలోని ప్రతీ ఇంటికి చేరే విధంగా ప్రచారం నిర్వహించాలన్నారు. గ్రామ, పట్టణాల ప్రధాన కూడళ్లలో హోర్డింగ్స్ ఏర్పాటు చేయాలన్నారు. హౌస్ లిస్టింగ్ సర్వే దిగ్విజయంగా నిర్వహించారని, అదే ఉత్సాహంతో సర్వే పూర్తయ్యేవరకు పకడ్బందీగా నిర్వహించాలన్నారు.

సర్వే నిబద్ధతతో నిర్వహించాలి..

అనంతరం అధికారులతో కలెక్టర్ అభిలాష అభినవ్ మాట్లాడారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర సర్వే ప్రక్రియను నిబద్ధతతో నిర్వహించాలన్నారు. ఎలాంటి అనుమానాలు, సందేహాలకు తావు లేకుండా ప్రజల నుండి కచ్చితమైన సమాచారం నమోదు చేయాలన్నారు. సర్వే ప్రక్రియను సూపర్‌వైజర్లు, మండల ప్రత్యేక అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని సూచించారు. సర్వేకు ముందు రోజు గ్రామాలు, పట్టణాల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని తెలిపారు. ప్రజల నుంచి సేకరించిన సమాచారం పూర్తిగా గోప్యంగా ఉంచడం జరుగుతుందన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఇన్‌చార్జి డీఆర్వో రత్నకళ్యాణి, సీపీవో జీవరత్నం, డీపీవో శ్రీనివాస్, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సంక్షేమ శాఖల అధికారులు రాజేశ్వర్‌గౌడ్, శంకర్, అంబాజీ, శ్రీనివాస్, మోహన్‌సింగ్, ఏడీ మార్కెటింగ్ శ్రీనివాస్, ఏడీ సర్వే లాండ్ రికార్డ్ రాథోడ్ సుదర్శన్, మున్సిపల్ కమిషనర్లు ఖమర్ అహ్మద్, రాజేశ్‌కుమార్, మనోహర్, అధికారులు పాల్గొన్నారు.

సర్వేను బహిష్కరించడం సరికాదు

కొన్ని గ్రామాలు సమగ్ర కుటుంబ సర్వేను బహిష్కరించడం సరికాదని కలెక్టర్ అభిలాష అభినవ్ ఒక ప్రకటనలో తెలిపారు. సర్వేను బహిష్కరించినా, అడ్డుకునే ప్రయత్నం చేసినా కఠిన చర్యలు ఉంటాయని పేర్కొన్నారు. సర్వేకు అందరూ సహకరించాలని సూచించారు. సర్వే ఆధారంగా అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలు చేయబడతాయని తెలిపారు. సర్వేలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని సూచించారు. సమగ్ర కుటుంబ సర్వే ఏ రాజకీయ పార్టీకి సంబంధించినది కాదని, సర్వేపై ఎలాంటి అపోహలు పెట్టుకోవద్దని పేర్కొన్నారు. సందేహాలు ఉంటే క్షేత్రస్థాయిలో ఎంపీడీవోలు, తహసీల్దార్లు, అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు.

గొల్లమాడలో పెద్దపులి సంచారం

- అక్కడి నుంచి అంజనీ తండా అడవిలోకి..
- పులి పాదముద్రలను గుర్తించిన అటవీశాఖ అధికారులు



పులి పాదముద్రలను పరిశీలిస్తున్న అధికారులు

నర్సాపూర్(జి): మహారాష్ట్ర నుంచి వచ్చిన పెద్దపులి పది రోజులుగా కుంటాల మండల అడవుల్లో సంచరించి శుక్రవారం రాత్రి నర్సాపూర్(జి) మండలం గొల్లమాడ అటవీ ప్రాంతానికి చేరింది. శుక్రవారం వేకువ జామున కుంటాలలో మార్నింగ్ వాక్ వెళ్లిన యువకులకు, రైతులకు కనిపించిన పులి అక్కడ నుంచి గొల్లమాడ పెద్దచెరువు వద్దకు వచ్చినట్లు అటవీ అధికారులు తెలిపారు. శనివారం అక్కడి నుంచి పంట పొలాల మీదుగా గొల్లమాడ మహాలక్ష్మి అమ్మవారి ఆలయ పరిసర ప్రాంతాల్లో సంచరించినట్లు స్థానికులు తెలిపారు. ప్రాణహిత -చేవెళ్ల కెనాల్ పక్కనుంచి తిమ్మాపూర్(జి) గ్రామ శివారులోని దత్తాత్రేయ మందిరం పక్కనుంచి ఒర్రె ద్వారా అంజని తండా అటవీ ప్రాంతంలోకి వెళ్లినట్లు స్థానికులు తెలుపడంతో అటవీశాఖ అధికారులు పాదముద్రల ఆధారంగా గుర్తించారు.

గాలింపు చర్యలు ముమ్మరం..

కుంటాల మండలం దౌనెల్లి అటవీ ప్రాంతం నుంచి మహారాష్ట్ర సరిహద్దు పంగర్‌పాడ్ అటవీ ప్రాంతంలో సంచరించిన పెద్దపులి శుక్రవారం రాత్రి నర్సాపూర్ (జీ) మండలంలోని గొల్లమాడకు చేరడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. వ్యవసాయ పనులకు వెళ్లి తిరిగి వస్తున్న గొల్లమాడ గ్రామ యువకుడికి పెద్దపులి కనిపించడంతో అటవీశాఖ అధికారులకు సమాచారం అందించినట్లు తెలిసింది. పులి సంరక్షణకు గొల్లమాడ, తిమ్మాపూర్(జి), అంజని తండా అటవీ ప్రాంతాల్లో రెండు బృందాలుగా ఎఫ్ఆర్‌వోలు రామకృష్ణ, వేణుగోపాల్ ఆధ్వర్యంలో సిబ్బంది గాలింపు చేపట్టారు. శనివారం గొల్లమాడ పంట పొలాలు, చేలల్లో పులి పాదముద్రలు గుర్తించినట్లు అధికారులు తెలిపారు. వ్యవసాయ పనులకు వెళ్లే రైతులు, కూలీలు త్వరగా పూర్తి చేసుకుని రావాలని సూచించారు. మండలంలోని అంజనీ తండా గ్రామస్తులకు అధికారులు శనివారం రాత్రి అవగాహన కల్పించారు. వ్యవసాయ పనులకు వెళ్లే రైతులు గుంపులు గుంపులుగా అలజడి చేస్తూ పనులకు వెళ్లాలని కోరారు. పంట పొలాలకు ఉచ్చులు, విద్యుత్ తీగలు ఏర్పాటు చేయవద్దని సూచించారు. పులి గాలింపులో ఎఫ్ఆర్‌వో రామకృష్ణ, ఫ్లయింగ్ స్క్వాడ్ అనిత, డీఆర్వో నజీర్‌ఖాన్, ఎఫ్ఎస్‌వో అలేఖ్య, ఎఫ్‌బీవో సాయరెడ్డి తదితరులు ఉన్నారు.

రేపు జిల్లాస్థాయి ఖోఖో పోటీలు

నిర్మల్ రూరల్: జిల్లాస్థాయి అండర్ 17 ఖోఖో సెలక్షన్స్ పోటీలు జిల్లా కేంద్రంలో సోమవారం నిర్వహిస్తున్నట్లు డీఈవో రవీందర్‌రెడ్డి, స్కూల్ గేమ్స్ జిల్లా సెక్రెటరీ రవీందర్‌గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని మంజులాపూర్‌లో గల విజయ ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఆధ్వర్యంలో పోటీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఆసక్తిగల విద్యార్థులు వివరాల కోసం విజయ హైస్కూల్ వ్యాయామ ఉపాధ్యాయుడు గిరిప్రసాద్‌ను సంప్రదించాలని సూచించారు.

'స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటుదాం'



మాట్లాడుతున్న ప్రేమేందర్‌రెడ్డి

నిర్మల్‌ఖైస్‌గేట్: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ సత్తా చాటుదామని పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, జిల్లా సంస్థ గత ఎన్నికల ఇన్‌చార్జి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు అంజుకుమార్‌రెడ్డి అధ్యక్షతన పార్టీ సంస్థగత ఎన్నికల కార్యశాల శనివారం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా బీజేఎల్పీ నేత, నిర్మల్ ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి, ముధోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ హాజరయ్యారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా భారతీయ జనతా పార్టీ సభ్యత నమోదు కార్యక్రమం చురుగ్గా కొనసాగుతుందన్నారు. ప్రతి ఒక్కరికీ అంత్యోదయ ఫలాలు అందేలా పార్టీని విస్తరించి సంస్థాగతంగా బలపడే విధంగా పాటుపడాలన్నారు. ప్రతీ మండలంలో 200 క్రియాశీల సభ్యత్వాలు చేసుకోవాలన్నారు. రానున్న రోజుల్లో స్థానిక సంస్థల్లో భారతీయ జనతా పార్టీ అభ్యర్థులను గెలిపించి తెలంగాణ రాష్ట్రంలో అధికారంలోకి రావడానికి నాంది పలకాలన్నారు. సుస్థిర దేశ అభివృద్ధి కోసం భారతీయ జనతా పార్టీ పాటుపడుతుందన్నారు. ప్రజల్లో బీజేపీపై ఉన్న నమ్మకంతో కేంద్రంలో మూడోసారి కూడా అధికారంలోకి వచ్చిందని పేర్కొన్నారు. దాదాపు 21 రాష్ట్రాలలో బీజేపీ అధికారంలో ఉందని తెలిపారు. రానున్న రోజుల్లో తెలంగాణలో కూడా అధికారంలోకి వచ్చేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. గతంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో కేవలం ఒక ఎంపీ సీటు మాత్రమే గెలుపొందామని ప్రస్తుతం నిర్మల్, ముధోల్, సిర్పూర్ అసెంబ్లీ స్థానాలతోపాటు ఎంపీ సీటు గెలిచామన్నారు. ఈ గెలుపు కోసం ప్రతీ కార్యకర్త కృషి చేశారన్నారు. కార్యక్రమంలో పార్లమెంట్ కన్వీనర్ అయ్యన్నగారి భూమయ్య, రాష్ట్ర నాయకులు రావుల రామ్‌నాథ్, జిల్లా ప్రధాన కార్యదర్శిలు మెడిసమ్మె రాజు, సామా రాజేశ్వర్‌రెడ్డి, పడిపెల్లి గంగాధర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ మల్లికార్జున్ రెడ్డి, హరినాయక్, నారాయణరెడ్డి, గోపాల్ సర్డ, సత్యనారాయణగౌడ్, జిల్లా క్రియాశీల సభ్యత్వ కోకన్వీనర్ రాచకొండ సాగర్, ప్రాథమిక సభ్యత్వ కన్వీనర్ కమల్‌నయన్ జిల్లా, మండల నాయకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అదృశ్యం



పోశయ్య

దహెగాం: మండలంలోని మొట్లగూడ గ్రామానికి చెందిన వృద్ధుడు ఎనగందుల పోశయ్య అదృశ్యం కావడంతో మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజు తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. గతనెల 10న పోశయ్య ఇంటి నుంచి వెళ్లి తిరిగిరాలేదు. కుటుంబీకులు బంధువుల ఇళ్లల్లో, చుట్టూ పక్క గ్రామాల్లో వెతికినా ఆచూకీ దొరకలేదు. కుమారుడు రమేశ్ ఫిర్యాదుతో శనివారం మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. గతంలో రెండుసార్లు ఇంటి నుంచి వెళ్లిపోయి వచ్చారని పేర్కొన్నారు.

షార్ట్‌సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం



పరామర్శిస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

తలమడుగు: మండలంలోని ఉండం గ్రామానికి చెందిన దేవుల్ల శంకరమ్మ ఇల్లు శుక్రవారం రాత్రి షార్ట్‌సర్క్యూట్‌తో దగ్ధమైంది. కుటుంబ సభ్యులు రాత్రి భోజనం చేసి పక్కనే ఉన్న మరో ఇంట్లో నిద్రిస్తుండగా ప్రమాదం జరిగింది. స్థానికులు మంటలు ఆర్పే ప్రయత్నం చేసిన ప్రయోజనం లేకపోయింది. ఇంట్లోని వస్తువులు, తిండిగింజలు, బట్టలు కాలి బూడిదయ్యాయి. రూ.1.50లక్షలు నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం నష్టపరిహారం అందించి ఆదుకోవాలని బాధితురాలు శంకరమ్మ కోరుతోంది. దగ్ధమైన ఇంటిని శనివారం ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ సందర్శించి బాధితురాలిని పరామర్శించారు. ప్రభుత్వ సాయం అందేలా చూస్తానని అన్నారు. బీఆర్‌ఎస్ నాయకులు తిరుమల గౌడ్, మొట్ట కిరణ్‌కుమార్, వెంకటేష్, అబ్దుల్లా, ప్రకాష్, అభిరామ్‌రెడ్డి, నర్సింలు, తదితరులు పాల్గొన్నారు. బాధితురాలిని మాజీ జెడ్పీటీసీ గోక గణేశ్‌రెడ్డి పరామర్శించారు. ఇందిరమ్మ ఇల్లు, నష్టపరిహారం మంజూరయ్యేలా చూస్తానని తెలిపారు. కాంగ్రెస్ నాయకులు రఫీ, వెంకన్నయాదవ్, దేశ్‌ముఖ్, రాకేష్ పాల్గొన్నారు.

రెండోరోజు రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలు



పోటీల్లో తలపడుతున్న బాలికల జట్లు

నిర్మల్‌ఖిల్లా: జిల్లాకేంద్రంలోని ఎన్టీఆర్ క్రీడా ప్రాంగణంలో రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీలు రెండోరోజు కొనసాగాయి. బాల,బాలికల విభాగంలో ప్రీక్వార్టర్స్ పోటీలు శనివారం రసవత్తరంగా సాగాయి. రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన 48 జట్లు దాదాపు 850 మంది క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొంటున్నారు. నెట్ బాల్ రాష్ట్ర అధ్యక్షుడు విక్రం ఆదిత్య రెడ్డి, సెక్రటరీ ఖాజాఖాన్, కోశాధికారి సోహెల్ రెహమాన్, జిల్లా అధ్యక్షుడు అనిల్ కుమార్, కార్యదర్శి మోహన్, వ్యాయామ ఉపాధ్యాయులు అన్నపూర్ణ, జమున, వన్నెల భూమన్న తదితరులు ఈ పోటీలను పర్యవేక్షించారు. ఆదివారంతో ఈ పోటీలు ముగియనున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు.

రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలు

- ప్రారంభించిన ఏసీపీ రవికుమార్
- ఉమ్మడి 9 జిల్లాల నుంచి 360 మంది క్రీడాకారులు హాజరు



ఫైనల్‌కు చేరిన ఆదిలాబాద్ జిల్లా జట్టు



సాఫ్ట్‌బాల్ ఆడుతున్న బాలికలు

బెల్లంపల్లి: పట్టణంలోని సింగరేణి తిలక్ స్టేడియంలో రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలు శనివారం ప్రారంభమయ్యాయి. ఉమ్మడి ఆదిలాబాద్ ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో అండర్–19 విభాగంలో బాల,బాలికలకు వేర్వేరుగా పోటీలను ఏర్పాటు చేశారు. ఆదివారం వరకు పోటీలు కొనసాగుతాయి. ఉమ్మడి 9 జిల్లాల నుంచి బాలికలు, బాలుర జట్లు హాజరు కాగా, 360 మంది క్రీడాకారులు, 40మంది టీమ్ మేనేజర్ కోచ్‌లు పాల్గొన్నారు. బెల్లంపల్లి ఏసీపీ ఏ.రవికుమార్ జెండా ఊపి ప్రారంభించారు. ఆర్డీవో పి.హరికృష్ణ, ఏసీపీ క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడాపోటీలు విద్యార్థుల్లో క్రమశిక్షణను, పోటీతత్వాన్ని నింపుతాయన్నారు. పోటీల్లో ప్రతిభ చాటిన క్రీడాకారులను జాతీయస్థాయి పోటీలకు ఎంపిక చేస్తారని తెలిపారు. ఎస్‌జీఎఫ్ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అండర్–19 విభాగం సెక్రెటరీ బి.బాబురావు మాట్లాడుతూ క్రీడాకారుల కోసం అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. తొలిరోజు ఆదిలాబాద్–రంగారెడ్డి జిల్లాల బాలుర, హైదరాబాద్–నిజామాబాద్ జిల్లాల బాలికల జట్లు తలపడ్డాయి.

ఫైనల్‌కు ఆదిలాబాద్ జిల్లాజట్టు

రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ క్రీడాపోటీల్లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బాలుర జట్టు ఆరంగ్రేట్రం చేసింది. అత్యుత్తమంగా ఆడి ఫైనల్‌కు చేరింది. నిజామాబాద్ జిల్లా బాలుర జట్టుపై 7–0 స్కోర్‌తో మొదటి సెమీఫైనల్ పోటీలో విజయం సాధించింది. మెదక్–మహబూబ్‌నగర్ జిల్లాల బాలుర జట్లు సెమీ ఫైనల్ చేరాయి. ఆయా జట్ల మధ్య ఆదివారం సెమీఫైనల్ మ్యాచ్ జరగనుంది. ఈ మ్యాచ్‌లో గెలుపొందిన జట్టుపై ఆదిలాబాద్ బాలుర జట్టు తుది పోరులో తలపడనుంది. కార్యక్రమంలో వన్‌టౌన్ ఎస్‌హెచ్‌ఓ ఎన్.దేవయ్య, సాఫ్ట్‌బాల్ టోర్నమెంట్ ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు రామ్మోహన్, రవి, యాకూబ్, రాజ్‌మహ్మద్, శ్రీనివాస్, స్వామి, సంతోష్, శ్రీనివాసరెడ్డి, చాంద్‌పాషా, చిన్నక్క, యాదగిరి, పరిశీలకులు గంగమోహన్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

పట్టుదలతో ఆడుతున్నాం



సాఫ్ట్‌బాల్ పోటీల్లో జిల్లా జట్టు గెలుపు కోసం పట్టుదలతో ఆడుతున్నాం. ఆటలో నైపుణ్యత కనబరిస్తే విజయం వరిస్తుంది. జాతీయ స్థాయిలో తాను ఇప్పటి వరకు నాలుగుసార్లు ఆడాను. అదే స్ఫూర్తితో ముందుకు సాగుతాం.

– టి.నేహశ్రీ, నిజామాబాద్

ఏ జట్టును తేలికగా తీసుకోం



రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనే ప్రతి జట్టులో ప్రతిభ గల క్రీడాకారులు ఉన్నారు. ఏ జట్టును మేము తేలికగా తీసుకోబోం. అన్ని జట్లను సమానంగానే చూస్తాం. తుది వరకు పోరాడి విజయం సాధించడానికి కృషి చేస్తాం.

– సీహెచ్.మానస, మెదక్

స్ఫూర్తిదాయకమైన ఆట ప్రదర్శిస్తాం



క్రీడల్లో గెలుపోటములు సహజం. జిల్లా జట్టు స్ఫూర్తిదాయకమైన ఆటను ప్రదర్శించడానికి ప్రాధాన్యత ఇస్తాం. నేను ఇప్పటి వరకు జాతీయ, రాష్ట్రస్థాయి పోటీల్లో ఆడాను. అనుభవంతో ప్రత్యర్థి జట్ల బల, బలాలను బేరీజు వేసుకుని ఆడుతాం.

– ఎం.వర్షిత, మహబూబ్‌నగర్

ప్రతిభ చాటుతాం



రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు జిల్లా అతిథ్యం ఇవ్వడం సంతోషంగా ఉంది. సుదూర ప్రాంతాల క్రీడాకారులు పాల్గొని ఉత్సాహంగా ఆడుతున్నారు. ఆదిలాబాద్ జిల్లా జట్టు గెలుపు సాధించడానికి స్థానిక పరిస్థితులు అనుకూలిస్తాయని భావిస్తున్నాం. ప్రతిభ ఉన్న క్రీడాకారులు జట్టులో ఉండటం కొండంత బలాన్నిస్తోంది.

– రాజ్‌పేటీ విక్కీ, ఆదిలాబాద్

సంతోషంగా ఉంది



హైదరాబాద్ చుట్టుపక్క ప్రాంతాల్లో మాత్రమే ఆడాం. ఈసారి కోల్‌బెల్ట్ ప్రాంతమైన బెల్లంపల్లికి రావడం కొత్త అనుభూతిని ఇస్తుంది. మా జట్టంతా ఉత్సాహంగా ఉంది. ఆటల్లో విజయం సాధించడానికి శాయశక్తులా ప్రయత్నిస్తాం. స్థానిక క్రీడాకారులు, ప్రజలు తమను ప్రోత్సహించడం మరువలేం.

– బి.వేణు, హైదరాబాద్

కొత్త పరిచయాలు



ఇతర జిల్లాల క్రీడాకారులతో తమకు స్నేహపూర్వక సంబంధాలు ఏర్పడ్డాయి. కొత్తపరిచయాలతో క్రీడల్లో మెరుగ్గా రాణించాలని అనుకుంటున్నాం. జట్టు సమష్టి కృషితో ఆడి విజయం సాధించడానికి ప్రతి ఒక్కరూ పట్టుదలతో ఉన్నాం.

– కె.అజయ్, ఆదిలాబాద్

వలస కార్మికుల చట్టాల సదస్సుకు జిల్లావాసి

నిర్మల్‌ఖిల్లా: ఉత్తరప్రదేశ్‌లోని ఆగ్రాలో ఈనెల 8 నుంచి 10 వరకు కొనసాగనున్న అంతర్జాతీయ వలస కార్మికుల చట్టాలు–రక్షణ సదస్సులో జిల్లాకు చెందిన గల్ఫ్ కార్మిక సంఘం నాయకుడు, ప్రవాసీమిత్ర లేబర్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు స్వదేశ్ పరికిపండ్ల పాల్గొంటున్నారు. అంతర్జాతీయ వలస కార్మిక చట్టాల ద్వారా కార్మికుల రక్షణపై అవగాహన బి.ఎం.డబ్ల్యూ అండ్ సాస్క్..నేపాల్, భారత్ దేశాల్లో నిర్వహిస్తున్న ప్రాజెక్టు కార్యక్రమాలు తదితర అంశాలు ఈ సదస్సులో చర్చిస్తున్నట్లు స్వదేశ్ పేర్కొన్నారు. ఇమిగ్రేషన్ చట్టం–1983కు ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా సవరణలు అవసరమని, గల్ఫ్ దేశాల్లో కార్మికులు మృతిచెందుతున్న నేపథ్యంలో ప్రవాసీ భారతీయ బీమా యోజన వర్తింపజేయాలని యూనియన్ తరపున నివేదించినట్లు పేర్కొన్నారు. ఈ సదస్సులో ఆయనతోపాటు నిజామాబాద్ జిల్లా సమన్వయకర్త దీకొండ కిరణ్ హాజరయ్యారు. కార్యక్రమంలో బీడబ్ల్యూఐ దక్షిణాసియా పాలసీ అధికారి రాజేష్‌శర్మ, ప్రోగ్రాం అధికారి ప్రేరణ ప్రసాద్ గుప్తా, నేపాల్, ఢిల్లీ, కేరళ, తమిళనాడు, ఒడిశా, ఉత్తరప్రదేశ్ తదితర రాష్ట్రాల కార్మిక సంఘాల నాయకులు, తెలంగాణ నుంచి జయవిద్యా, స్వామ్రాట్, గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

ఇద్దరి రిమాండ్

కెరమెరి: పత్తి చేనులోంచి 45 పైపులను ఎత్తుకెళ్లిన ఘటనలో ఇద్దరిని రిమాండ్ తరలించినట్లు ఎస్సై గుంపుల విజయ్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం..మండలంలోని గోయగాం గ్రామానికి చెందిన నాగోసే సత్తయ్య, మొహర్లే జానకీరావులకు చెందిన పత్తి చేల నుంచి గత నెల 12న గోయగాంకు చెందిన గావ్రుత్రె గణపతి, వాంకిడి మండలం లంజన్వీరకు చెందిన వాడై సుందరంల 45 నీటిపైపులను ఎత్తుకెళ్లారు. కెరమెరి పోలీసులు పట్టుకుని పైపులను స్వాధీనం చేసుకుని సిర్పూర్ కోర్టులో హాజరుచర్చగా శనివారం మెజిస్ట్రేట్ 14 రోజులు జ్యూడీషియల్ రిమాండ్ విధించారని ఎస్సై తెలిపారు.

గొడ్డలితో నరికి ఒకరి హత్య

- ముత్తరావుపల్లిలో ఘటన
- కేసు నమోదు చేసిన పోలీసులు



మల్లయ్య మృతదేహం

చెన్నూర్‌రూరల్: గొడ్డలితో నరికి ఒకరిని హత్య చేసిన ఘటన మండలంలోని ముత్తరావుపల్లిలో చోటుచేసుకుంది. చెన్నూర్ పట్టణ సీఐ రవీందర్ కథనం ప్రకారం.. ముత్తరావుపల్లి గ్రామానికి చెందిన పైడిపల్లి మల్లయ్య(50), భార్య మల్లక్క, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఇందులో పెద్ద కుమారుడు పైడిపల్లి రాజశేఖర్ అదే గ్రామానికి చెందిన జాడి భూమయ్య భార్య సౌందర్యను ఇష్టపడి ఏడు నెలల క్రితం వెళ్లిపోయి సహజీవనం చేస్తున్నారు. భార్య కనిపించడం లేదని భూమయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ క్రమంలో పోలీసులు రాజశేఖర్, సౌందర్యను పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించారు. అయినప్పటికి సౌందర్య భర్తతో ఉండనని ప్రియుడు రాజశేఖర్‌తోనే ఉంటానని చెప్పి వెళ్లిపోయింది. ఈ క్రమంలో రాజశేఖర్ కుటుంబంపై భూమయ్య పగ పెంచుకున్నాడు. రాజశేఖర్ తండ్రి మల్లయ్య శనివారం బహిర్భూమికని గ్రామ సమీపంలోని వాగు వద్దకు వెళ్లగా అక్కడే వేచి ఉన్న భూమయ్య గొడ్డలితో నరికి హత్య చేశాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. పెద్ద కుమారుడు ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

వివాహిత ఆత్మహత్యపై డీఎస్పీ విచారణ



రేవోజీపేటలో విచారణ చేస్తున్న డీఎస్పీ గంగారెడ్డి

దస్తురాబాద్: మండలంలోని రేవోజీపేటకు చెందిన వివాహిత లత వరకట్న వేధింపులకు ఆత్మహత్య చేసుకున్న ఘటనపై నిర్మల్ డీఎస్పీ గంగారెడ్డి శనివారం విచారణ చేపట్టారు. మృతురాలి తల్లి పోగుల మల్లీశ్వరిని అడిగి వివరాలు తెలుసుకున్నారు. పోస్టుమార్టం నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. సీఐ సైదరావు, ఎస్సై శంకర్ తదితరులు ఉన్నారు.

పథకం ప్రకారం హత్య చేశారని..

మండల కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మృతురాలు తల్లితోపాటు పౌర హక్కుల సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కుమారస్వామి మాట్లాడారు. అదనపు కట్నం కోసం లతను భర్త నాగరాజు, అత్తమామలు సత్తవ్వ, వెంకటి వేధించారన్నారు. పథకం ప్రకారమే హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరించారని ఆరోపించారు. జిల్లా పౌరహక్కుల సంఘం అధ్యక్షుడు రాజగోపాల్, కుల నిర్మూలన పోరాట సమితి నాయకులు అభినవ్, గంగారెడ్డి, సుదర్శన్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

మద్యానికి బానిసై వ్యక్తి ఆత్మహత్య

భైంసారూరల్: మద్యానికి బానిసై వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు సీఐ నైలు తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మండలంలోని దేగాం గ్రామానికి చెందిన ద్యారంగుల హన్మంతు(38) గత కొంతకాలంగా మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో జీవితంపై విరక్తితో శనివారం ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబీకులు అందించిన సమాచారంతో పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భైంసా ఏరియాస్పత్రికి తరలించారు. కుటుంబీకుల ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

ఆదిలాబాద్‌లో పురుగుల మందు తాగి ఒకరు..

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని వికలాంగుల కాలనీకి చెందిన సయ్యద్ కలీం (38) పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. టూటౌన్ హెడ్‌కానిస్టేబుల్ సయ్యద్ ఇసాక్ అలీ కథనం ప్రకారం..శుక్రవారం సాయంత్రం పట్టణంలోని ఎరోడ్రమ్ మైదానంలో పురుగుల మందు తాగి కుమారుడికి ఫోన్ ద్వారా సమాచారమిచ్చాడు. కుటుంబీకులు అక్కడికి చేరుకుని అతన్ని రిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. గత రెండేళ్లుగా మద్యానికి బానిసైన కలీం జీవితంపై విరక్తితో ఈ అఘాయిత్యానికి పాల్పడినట్లుగా వివరించారు. ఈమేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

ఉమ్మడి జిల్లాస్థాయి హాకీ ఎంపిక పోటీలు

ఆదిలాబాద్: జిల్లాకేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో ఎస్జీఎఫ్ అండర్–17 జిల్లాస్థాయి బాలికల హాకీ ఎంపిక పోటీలు శనివారం నిర్వహించారు. జిల్లా గిరిజన క్రీడల అధికారి పార్థసారథి, ఎస్జీఎఫ్ సెక్రెటరీ కాంతారావు ఈ పోటీలను ప్రారంభించారు. జోనల్ స్థాయి పోటీల్లో ప్రతిభ కనబర్చినవారు నిజామాబాద్ జిల్లాలో ఈనెల 11 నుంచి 13వ వరకు జరిగే పోటీల్లో పాల్గొంటారని వివరించారు. రవీందర్, హరిచరణ్, శ్రీనివాస్, త్రివేణి, అశోక్, మహమ్మద్ తదితరులు ఉన్నారు.

సెమీస్‌లో ఆదిలాబాద్ జిల్లా బాలికల జట్టు

ఆదిలాబాద్: సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో నిర్వహిస్తున్న ఎస్జీఎఫ్ రాష్ట్రస్థాయి అండర్–14 హ్యాండ్‌బాల్ పోటీల్లో జిల్లా బాలికల జట్టు సత్తా చాటింది. తొలి నాలుగు మ్యాచ్‌ల్లో విజేతగా నిలిచి సెమీస్‌లోకి దూసుకెళ్లిందని కోచ్ అరవింద్, మేనేజర్ స్ఫూర్తి, వివేక్ తెలిపారు. ప్రతిభ కనబర్చిన బాలికల జట్టుకు ఎస్జీఎఫ్ సెక్రెటరీ కాంతారావు, పీడీ హరిచరణ్‌లు అభినందనలు తెలిపారు.

కవ్వాల్.. ప్లాస్టిక్ ఫ్రీజోన్

- అటవీశాఖ ప్రత్యేక దృష్టి
- 'టైగర్ రిజర్వు'లో ప్లాస్టిక్ నిషేధం
- ప్రజలకు అవగాహన కల్పిస్తున్న అధికారులు



ప్లాస్టిక్ వస్తువులతో అటవీ సిబ్బంది

జన్నారం: కవ్వాల్ టైగర్ రిజర్వు (కేటీఆర్)ను ప్లాస్టిక్ రహిత ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు అటవీశాఖ ప్రత్యేక దృష్టిసారించింది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఇప్పటికే ఉత్తర్వులు జారీ చేశారు. కవ్వాల్ టైగర్‌జోన్ ప్లాస్టిక్ ఫ్రీజోన్‌గా ఏర్పాటు చేశారు. గత జూలై 1 నుంచి ప్లాస్టిక్ నిషేధం అమల్లోకి వచ్చింది. ఈక్రమంలో అటవీ ప్రాంతంలో ప్లాస్టిక్ వాడకం కొంత తగ్గింది. నెలకోసారి ప్లాస్టిక్ ఏరివేత కార్యక్రమంలో భాగంగా ఆడపదడపా ఉన్న ప్లాస్టిక్ వస్తువులను సిబ్బంది తొలగిస్తున్నారు.

ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై దృష్టి..

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు మధ్యలో జన్నారం మండలం ఉంది. ప్రయాణికులు అటవీప్రాంతం గుండా వివిధ గ్రామాలకు వెళ్తుంటారు. నిర్మల్, ఆదిలాబాద్, మంచిర్యాల జిల్లాలకు చెందినవారు వాహనాల రాకపోకలు సాగిస్తుంటారు. ఈక్రమంలో ప్లాస్టిక్ సంచుల ద్వారా ఆహారం, తినుబండరాలు తీసుకెళ్తూ పాడేస్తున్నారు. వీటితో వన్యప్రాణులకు ముప్పు పొంచి ఉంది. కాగితపు, జనపనార సంచులు, ఇతర ప్రత్యామ్నాయ మార్గాలపై దృష్టి పెట్టాలని అధికారులు వ్యాపారులకు సూచిస్తున్నారు. ప్లాస్టిక్ వస్తువులను నిషేధించాలని వారికి నోటీసులు జారీ చేశారు. ప్రజలు, పాఠశాల విద్యార్థులకు ఇప్పటికే అవగాహన కల్పించారు.

పంచాయతీకి అప్పగింత

జన్నారం అటవీ డివిజన్‌లో నెలకోసారి ప్లాస్టిక్ ఏరివేత కార్యక్రమం చేపడుతున్నారు. రేంజ్ అధికారి నుంచి మొదలు, బేస్‌క్యాంపు సిబ్బంది ఇందులో పాల్గొంటున్నారు. ప్లాస్టిక్‌వస్తువులను సేకరించి బస్తాల్లో నింపి గ్రామ పంచాయతీకి అప్పగిస్తున్నారు. ట్రాక్టర్ల ద్వారా డంపింగ్ యార్డులకు తరలిస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఇప్పటివరకు వందల సంఖ్యలో బస్తాలను పంచాయతీ ట్రాక్టర్ల ద్వారా డంపింగ్ యార్డులకు పంపినట్లు పేర్కొంటున్నారు.

నెలకోసారి ప్లాస్టిక్ ఏరివేత



జన్నారం అటవీ డివిజన్‌లో ప్లాస్టిక్ వస్తువులు పడేయొద్దు. ఉన్నతాధికారుల ఆదేశాలతో షాపుల యజమానులు, విద్యార్థులు, ప్రజలకు అవగాహన కల్పించాం. నెలకోసారి ప్లాస్టిక్ ఏరివేత కార్యక్రమం చేపడుతున్నాం. – సుష్మారావు, ఫారెస్ట్ రేంజ్ అధికారి

డ్రైవర్, కండక్టర్‌పై దాడిచేసిన ఇద్దరిపై కేసు

సారంగపూర్: ఆర్టీసీ డ్రైవర్, కండక్టర్‌పై దాడి చేసిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మండలంలోని రాణాపూర్ సమీపంలో శుక్రవారం రాత్రి నిర్మల్ నుంచి ఆదిలాబాద్ వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఆవును ఢీకొట్టగా తీవ్రంగా గాయపడింది. డ్రైవర్ బస్సును నిలపకుండా వెళ్లాడు. ఆగ్రహించిన గ్రామస్తులు ఆడె శ్రీనివాస్, మోహన్‌నాయక్‌లు వెంబడించి బస్సును నిలిపివేయించారు. డ్రైవర్‌తోపాటు కండక్టర్‌ను దాడిచేసిన ఇద్దరిపై శనివారం కేసు నమోదు చేసి నిర్మల్‌కోర్టులో హాజరుపర్చగా, 11రోజులు రిమాండ్ విధించినట్లు ఎస్సై తెలిపారు.

భవనంపై నుంచి పడి వ్యక్తి మృతి

ఆదిలాబాద్‌టౌన్: వెల్డింగ్ పనిచేస్తుండగా ప్రమాదవశాత్తు భవనంపై నుంచి పడి వ్యక్తి మృతిచెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. పట్టణంలోని కేఆర్‌కే కాలనీకి చెందిన సర్దార్‌ఖాన్ (53) శుక్రవారం మహారాష్ట్రలోని పాండ్రకవడలోని మహా ఆశ జిన్నింగ్ మిల్లులో వెల్డింగ్ చేస్తున్నాడు. ప్రమాదవశాత్తు భవనంపై నుంచి కిందపడ్డాడు. దీంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. మిల్లు సిబ్బంది ఆదిలాబాద్ రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈమేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ హెడ్‌కానిస్టేబుల్ కోటేశ్వర్‌రావు తెలిపారు.

చికిత్స పొందుతూ ఒకరు..

ఆదిలాబాద్‌టౌన్: మహారాష్ట్రలోని కిన్వట్ తాలుకా రాజ్‌గడ్‌కు చెందిన లొకండే ప్రమోద్ (30) జీవితంపై విరక్తితో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ నెల 4న ఇంట్లో పురుగుల మందు తాగగా కుటుంబీకులు గమనించి రిమ్స్‌కు తరలించారు. శనివారం చికిత్స పొందుతూ మృతి చెందాడు. ప్రమోద్.. గ్రూప్స్ పరీక్షలకు సన్నద్ధమవుతున్నాడు. ఆశించిన స్థాయిలో పంటలు పండక కుటుంబీకులు చదివించలేని స్థితిలో ఉండటంతో ఈ అఘాయిత్యానికి పాల్పడినట్లుగా టూటౌన్ హెడ్ కానిస్టేబుల్ వినాయక్‌రావు తెలిపారు. ఈమేరకు కేసు నమోదు చేసిదర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

రేవంత్‌రెడ్డిపై కేసు నమోదు చేయాలి

- బీఆర్‌ఎస్ ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న



నిరసన తెలుపుతున్న జోగు రామన్న, జనార్దన్

ఆదిలాబాద్‌టౌన్: సీఎం రేవంత్‌రెడ్డి తన స్థాయి మరిచి హింసను ప్రేరేపించేలా, ప్రజలను రెచ్చగొట్టేలా అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు బీఆర్‌ఎస్ ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న అన్నారు. మాజీ సీఎం కేసీఆర్, మాజీమంత్రులు కేటీఆర్, హరీశ్‌రావుపై సీఎం చేసిన వ్యాఖ్యలపై ఆగ్రహం వ్యక్తంచేస్తూ శనివారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో రేవంత్‌రెడ్డి చిత్రపటాన్ని దహనం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం తన పుట్టినరోజు వేరే వాళ్ల చావులను కోరడం ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నామన్నారు. సీఎం రేవంత్‌రెడ్డిపై కేసు నమోదు చేయాలని ఎస్పీ గౌస్ ఆలంను కలిసి ఫిర్యాదు చేశారు. నిరసనలో జెడ్పీ మాజీ చైర్మన్ రాథోడ్ జనార్దన్, పార్టీ నాయకులు అలాల్ అజయ్, విజ్జగిరి నారాయణ, మెట్టు ప్రహ్లాద్, గంద్రత్ రమేశ్, దాసరి రమేశ్, కొండా గణేశ్, పవన్ నాయక్, దమ్మాపాల్, బట్టు సతీశ్, సలీమ్ తదితరులు పాల్గొన్నారు.

రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి



గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

మంచిర్యాలక్రైం: స్థానిక రైల్వే స్టేషన్ సమీపంలో హమాలివాడ రైల్వే ట్రాక్ పక్క నుంచి శనివారం నడుచుకుంటూ వెళ్తున్న గుర్తుతెలియని వ్యక్తిని వెనుక నుంచి వచ్చిన సింగరేణి ప్యాసింజర్ రైలు ఢీకొంది. ఆయన తలకు తీవ్రగాయాలు కాగా ట్రాక్‌మెన్ మల్లేశ్ గమనించి అంబులెన్స్ సిబ్బందికి సమాచారం అందించారు. వారు అక్కడికి చేరుకుని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రిలో భద్రపర్చామని, వివరాలకు తెలిసిన వారు 8712658596, 9701112343 సెల్‌నంబర్లలో సంప్రదించాలని జీఆర్పీ ఎస్సై మహేందర్ తెలిపారు.

హత్యకు సహకరించిన వ్యక్తి రిమాండ్

భీమిని: కన్నెపల్లి మండలం సాలిగాం పంచాయతీలో గోమాస నరేందర్ హత్యకు సహకరించిన వ్యక్తిని రిమాండ్‌కు తరలించినట్లు తాండూర్ సీఐ కుమారస్వామి తెలిపారు. ఆయన కథనం ప్రకారం ..గత అక్టోబర్ 15న సాలిగాం గ్రామంలో అల్లుడు గోమాస నరేందర్ వేధింపులు భరించలేక మామ గోలేటి శంకర్ అతన్ని గొడ్డలితో దాడి చేసి హత్యచేశాడు. మామ శంకర్, అత్త లక్ష్మి, భార్య భవాని అలియాస్ బేబిలను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించారు. హత్యకు సహకరించిన భీమారం మండలం లంబడితండాకు చెందిన బానోతు రాము పాత్ర ఉందని తెలడంతో శుక్రవారం రాత్రి అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

నగదు, బైక్‌తో యువకుడు పరారీ

ఇంద్రవెల్లి: నగదు, బైక్‌తో యువకుడు పరారీ అయిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. ఎస్సై సునీల్ కథనం ప్రకారం..గుడిహత్నూర్ మండలం శాంతపూర్‌కు చెందిన వ్యాపారి సాబ్లే జైరాం అదేగ్రామానికి చెందిన బస్సి ఓంకార్‌లు మొక్కజొన్న పంట కొనుగోలు చేయడానికి శనివారం ఇంద్రవెల్లి మండలం బుర్సన్‌పటర్‌కు బైక్‌పై వచ్చారు. సాబ్లే జైరాం రైతుల వద్దకు వెళ్లి మొక్కజొన్న నాణ్యత, తేమశాతం చూస్తున్నాడు. ఆ సమయంలో బైక్‌తోపాటు అందులో ఉన్న రూ.4.20 లక్షల నగదుతో ఓంకార్ పరారీ అయ్యాడు. జైరాం ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.